
238
౨౩౮

# భారత కమ్యూనిస్టులు

## వారి వింత వైఖరి

31 JAN 1945
MADRAS



భారత సేవాసంఘము,

కర్నూలు

౧౯౪౫.

1945

TL
V2,4N24
35N45
157054

వందేమాతరమ్.

Communistulu

Bharata ~~Kamyunistulu~~

# భారత కమ్యూనిస్టులు:

## వారి వింత వైఖరి

Vari Vinta Vaikari

31 JAN 1946
MADRAS

భారత సేవా సంఘము

కర్నూలు

వారి ఎలెక్షన్ మానిఫెస్టో

S. No: 842
Acc No: 21,596.

All rights reserved]

[వెల: నాలుగు అణాలు.

# కృతజ్ఞత

అడిగినవెంటనే ఆంధ్ర, ఆంగ్ల, హిందీ పత్రికలనుండి, అనేక గ్రంథములనుండి విషయము సేకరించి శ్రమ అనుకొనక మాకీ చిన్నిపొత్తమును వ్రాసియిచ్చిన రచయితకు మా కృతజ్ఞత తెలుపుతున్నాము.

సాధ్యమైనంత త్వరలో ఈ గ్రంథాన్ని ఆంగ్ల, హిందీ భాషలలోనూ పరివర్తింపించి ప్రచురించుటకు ప్రయత్నింతుము. భారతీయులెల్లరును మా ఉద్యమమునకు తగు ప్రోత్సాహ మొసగుదురని ఆశిస్తున్నాము.

ముఖ్యముగ ఎన్నికల సందర్భములో కమ్యూనిస్టులు చేయుచున్న దుష్ప్రచారమును అరికట్టుటకు ఈ గ్రంథమును విరివిగా ప్రచారము చేయవలసినదిగ కాంగ్రెసు వర్కర్లను, తాలూకా, జిల్లా, రాష్ట్ర కాంగ్రెసు సంఘములను ప్రార్థిస్తున్నాము.

ఇట్లు,

తేదీ :
15-11-45

భారత సేవాసంఘము,
కర్నూలు.

TL
V2,4N24
600 008.

# భారత కమ్యూనిస్టులు

## ప్రారంభదశ

1917—1930

1917-వ సంవత్సరం రష్యాలో వచ్చిన విప్లవంవల్ల ప్రపంచ దృష్టి కమ్యూనిజంపై పడింది. ఇంతటి మహావిప్లవం ప్రపంచ గత చరిత్రలో ఎన్నడూ రాలేదు. మార్క్సు సిద్ధాంతాలన్నింటినీ తెలిసికొన్న రాజకీయవేత్తలు చాలామంది ఇవి ఆదర్శంగా వున్నప్పటికీ ఆచరణలోకి రావటం దుస్సాధ్యమని విమర్శిస్తూవచ్చారు. మార్క్సు జర్మనీలో బహిష్కరింపబడి ఇంగ్లండుకు వచ్చిచేరి తన సిద్ధాంతాల్ని ప్రచారంచేస్తుండగా లెనిన్ దృష్టిని బాగా ఆకర్షించాయి. లెనిన్ ఈ సిద్ధాంతాలతో రష్యాను జార్లనుండి తప్పించాలనీ, విప్లవం తీసుకరావాలనీ ప్రయత్నం చేయసాగాడు. రష్యాలోని కార్మిక, కర్షకుల్లో కొంత పరివర్తనం కలిగించాడు. ఒకవైపు ఇతడు ఈవిధంగా ప్రయత్నిస్తూంటే ఇంగ్లండు మొదలైన దేశాల్లో లెనిన్ వట్టి పిచ్చికలలు కంటున్నాడని హేళనచేయసాగారు. హఠాత్తుగా 1917-వ సంవత్సరంలో రష్యాలో విప్లవం వచ్చింది. విప్లవకారులు కొన్నిలక్షల ప్రాణాల్ని నిర్దాక్షిణ్యంగా తీశారు. విప్లవం వృద్ధి కావటానికెన్ని ప్రయత్నాలు జరిగాయో, విప్లవం అణచటానికికూడా అన్ని ప్రయత్నాలు జరిగాయి. తుదకు జార్ల పీనుగులపెంటపై విప్లవకారుల ఎఱ్ఱజండా లెగిరాయి. లెనిన్ నాయకత్వంక్రింద కమ్యూనిస్టుల ప్రభుత్వం ఏర్పడింది. అఘటన ఘటనా సామర్థ్యంతో విప్లవకారులు సాధించిన విజయం ప్రపంచదృష్టిని ఒక్కమారు ఆకర్షించింది.

1917 సం. నాటికి మన భారతదేశంలో కాంగ్రెసు బలపడి వుండింది. చదువుకొన్నవారిలో రాజకీయభావాలు వ్యాపింపసాగాయి. మిత

వాదులనీ, అతివాదులనే రెండు పక్షాలతో కాంగ్రెసురథం సాగుతూండినది. 1916 సం. లో గాంధీజీనాయకత్వంక్రింద చాంపరాన్‌లో కాంగ్రెసు సాధించిన సత్యాగ్రహవిజయంవల్ల కాంగ్రెసుభవిష్యత్తులో అందరకూ నమ్మకం కలిగింది. రష్యావిప్లవం భారతప్రజల్ని సైతం బాగా ఆకర్షించింది. ఎడాపెడా మార్క్స్ సిద్ధాంతాలు కొంతమంది తెలిసికోసాగారు.

తరువాత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అనే సంస్థ భారతదేశంలో స్థాపించబడింది. ఈసంస్థని కాంగ్రెసు ఆశీర్వదించింది. ఆతర్వాత అక్కడక్కడా లేబరు యూనియనులుకూడా ఏర్పడ్డాయి. లేబరు యూనియన్ నాయకులలోనూ, టి. యు. కాంగ్రెసువారిలోనూ సామ్యవాద సిద్ధాంతాలపైన కొంతమందికి అభిమానం హెచ్చుకాజొచ్చింది. రష్యాలో వేయబడ్డ ప్రథమ పంచవర్షప్రణాళిక సఫలమైంది. దీనితో చాలామందికి సామ్యవాదముపైనా, కమ్యూనిజముపైనా అభిమానము వేర్లుపాదుకపోయింది.

ఫిబ్రవరి 1927 లో బ్రస్సెల్స్‌లో ఒక పీడితజాతుల మహాసభ జరిగింది. ఫ్రాన్సు, ఇటలీ, ఇంగ్లండు మొదలైన దేశాలు వలసలు కలిగినవికావటంచేత ఇల్లాంటిసభలకు అవకాశ మిచ్చేవి కావు. జర్మనీకి యుద్ధానంతరం వలసలేమీ లేకపోవటంమూలాన ఫీడితజాతులకు, కమ్యూనిస్టులకు బెర్లిన్‌నగరము కేంద్రంగా వుండింది. బ్రస్సెల్స్ మహాసభలో పీడితజాతుల ప్రతినిధులందరూ పాల్గొన్నారు. అప్పుడు బెర్లిన్‌లో వున్న జవహర్‌లాల్ నెహ్రూగారిని భారతదేశ ప్రతినిధిగా సభలో పాల్గొనమని కాంగ్రెసు ఆదేశించింది. ఆసభలో ఎక్కువగా కమ్యూనిస్టులే ట్రేడు యూనియన్ల తరపున పాల్గొన్నారు. కమ్యూనిస్టుల విప్లవధోరణి సభ్యులను బాగా ఆకర్షించింది. నెహ్రూకుకూడా సామ్యవాదంపై గాఢమైన ఆదరం కలిగి రష్యాలో జరిగిన విప్లవ దశవార్షికోత్సవానికి వెళ్ళివచ్చాడు. అప్పటినుండి నెహ్రూకుకూడా సామ్యవాదధోరణి బాగా అమరింది.





బ్రస్సెల్స్ మహాసభానంతరం ఇండియాలోనూ సామ్యవాదులు, కమ్యూనిస్టులు, కమ్యూనిజంపై అభిమానం చూపేవారూ ఎక్కువకాసాగారు. ఇందువల్లనే ట్రేడుయూనియన్ కాంగ్రెసులో భిన్నాభిప్రాయాలు తలెత్తసాగాయి. రెండుపార్టీలమధ్య ఘర్షణ ఏర్పడింది. టి. యు. సి. నాయకత్వం పారిశ్రామికులు కానివారి చేతుల్లో వుండింది. దీనికంతా ప్రధాననాయకుడు యన్. యం. జోషి. ఇతడు టి. యు. సి. ఉద్యమాని కెంతో సేవచేశాడు. తరచు ఇతడే జనీవాలో జరిగే ఇంటరునేషనల్ లేబరు ఆఫీసు కాన్ఫరెన్సుకు భారతప్రతినిధిగా వెళ్ళేవాడు. ఇతను మితవాది. పారిశ్రామిక ఉద్యమానికి రాజకీయసంబంధాన్ని జోడించేందుకు ఒప్పుకోడు. మెల్లమెల్లగా సంస్కరణలు జరగాలని కోరేవాడు. టి.యు.సి. క్రిందితరగతిలో విప్లవవాదు లెక్కువయ్యారు. వీరికి క్రిందితరగతివారిలో పలుకుబడి వుందికాని, పైతరగతి నాయకవర్గంలో వీరికి పలుకుబడి ఏమాత్రం లేదు. 1928-వ సంవత్సరం జారియాలో జరిగిన టి.యు.సి. మహాసభలో అధ్యక్షపదవికోసం విప్లవవాదుల తరపున ఒకరు పోటీచేశారు. యన్. యం. జోషి నిలబడుతే నెగ్గలేడనే ఉద్దేశంతో సంస్కరణవాదులు నెహ్రూ పేరును సూచించారు. ఆ సంవత్సరం నెహ్రూ అధ్యక్షుడయ్యాడు. రానురాను చీలిక లెక్కువకాసాగాయి. టి. యు. సి. లో ఆధిపత్యంకోసం కమ్యూనిష్టులు ప్రయత్నించి విఫలులుకావటంచేత తీవ్రమైన అభిప్రాయభేదా లేర్పడ్డాయి.

టి. యు. సి. లో ఏలాంటి అధికారబాధ్యతలు లేకపోయినా కమ్యూనిస్టులకూ, కమ్యూనిజాన్ని అభిమానించేవారికీ క్రిందితరగతిలో పలుకుబడి వుండింది. దాన్ని పురస్కరించుకొని రాజకీయమైన విప్లవ పంథాను స్పష్టంగా బయటపెట్టారు. ఈ అతివాదులతో యన్. యం. జోషి పార్టీ మితవాదులు చేతులు కలుపకపోవటంవల్ల వీరు బొంబాయిలోని నేత

పనివాండ్రను కలుపుకొని ఒక గొప్ప సమ్మె కట్టించారు. తరువాత ఈ విప్లవవాదుల శ్రద్ధతో గిర్నీకాంఘర్ యూనియన్ అనే ఒక లేబరుసంస్థ బొంబాయిలోని లేబరు వ్యవహారాలన్నింటికీ ఆధిపత్యం వహించి పనిచేయ సాగింది. జి. ఐ. పి. రైల్వేయూనియన్‌లోకూడా వీరికే మంచి పలుకు బడి వుండింది. ఆతరువాత రెండు సంవత్సరాలవరకు దేశంలో పలుచోట్ల సమ్మెలు విపరీతంగా సాగాయి. టి. యు. సి. ఉద్యమం బాగా అభివృద్ధి చెందింది. సమ్మె లన్నిటిలోనూ ఈ విప్లవవాదులే ప్రాముఖ్యం వహించే వారు. ఈవిధంగా సమ్మెలు దేశంలో సాగించటంవల్ల గవర్నమెంటు వారికి కన్నెఱ్ఱనైంది. వీటికంతా కారకులైన సామ్యవాదుల్ని, కమ్యూనిస్టుల్ని, బొంబాయి గిర్నీకాంఘరు యూనియన్ నాయకుల్ని, ఇంకా సంయుక్త పరగణాలూ, బీహారు, పంజాబ్ మొదలగుచోట్ల నున్న టి. యు. సి. నాయకుల్నీ ప్రభుత్వం 1929 మార్చితో నిర్బంధించింది. బొంబాయి, పంజాబ్, యు. పి. ప్రాంతాల్లో వందల ఇండ్లను ప్రభుత్వంవారు ఇండియన్ పీనల్‌కోడ్ 121 (ఎ) సెక్షన్‌క్రింద సోదాచేశారు. ఈసందర్భంలో చాలా అరెస్టులు జరిగినవి. ఎ. ఐ. సి. సి. సభ్యులుకూడా ఇందులో ఎనిమిదిమంది కలరు.

అరెస్టు చేయబడ్డవారినందరినీ మీరటుకు విచారణకోసం ప్రభుత్వం వారు పంపారు. అందువల్లనే ఇది "మీరటు కుట్రకేసు" అని సుప్రసిద్ధమైంది. వీరందరిపైనా దేశంలో సామ్యవాద సిద్ధాంతాల్ని ప్రచారం చేస్తున్నా రనే అభియోగం తీసుకరాబడింది.

1929 మేనెలలో బొంబాయిలో జరిగిన ఎ. ఐ. సి. సి. సమావేశంలో మీరటు ముద్దాయీల "డిఫెన్సుకమిటీ" ఒకటి కాంగ్రెసు పెద్దలతో ఏర్పాటుచేయబడ్డది. దానికి అధిపతి మోతీలాల్‌నెహ్రూ. డాక్టరు అన్సారీ, జవహర్‌లాల్‌నెహ్రూప్రభృతు లందులో సభ్యులుగా వుండిరి.





అదే కాంగ్రెసు సమావేశంలో "మీరటు" ముద్దాయీల సహాయంకోసం కాంగ్రెసునిధినుండి 1500 రూపాయీలు మంజూరు చేయబడింది. ఇది చాలా కొద్దిమొత్తము. ఈ కేసు కెంతోడబ్బు అవసరముగా వుండెను. దేశంలో ఈనిధికి డబ్బువచ్చే అవకాశ మేమీ లేదు. ఎందుకనగా, ధనికులకు సామ్యవాదులపైనా, కమ్యూనిస్టులపైనా, లేబరు ఉద్యమకారులపైనా అంతగా అభిమానము లేదు. అందువలన నెహ్రూ మొదలైనవారంతా పనివాండ్లవద్దనుండే ధనం ప్రోగుచేసి కేసును జరిపించ సాగారు. ఆ సంవత్సరాంతంవరకూ విచారణ జరిగింది. డిఫెన్సుకమిటీ వా రెంత ప్రయత్నించినా కొందరికి శిక్షలు తప్పినవి కావు. నేడు కమ్యూనిస్టు పార్టీకి నేతగా వున్న పి. సి. జోషీ, ఇంకా నేటి తదితర కమ్యూనిస్టు నాయకులూ ఈ కేసులో ముద్దాయీలుగా వున్నవారే!

## ౨

## 1933—1945 ఆగస్టు.

1933-వ సంవత్సరంలో కమ్యూనిస్టులు కాంగ్రెసుతో ప్రత్యక్షంగా విరోధించారు. అంతవరకూ కాంగ్రెసు కమ్యూనిస్టుల్ని ద్వేషించలేదు— పైపెచ్చు అభిమానము చూపుతూవచ్చిందికూడా! అట్లాంటి స్థితిలో 1933 నాటినుండి కమ్యూనిస్టులు కాంగ్రెసును దూషించటం మొదలుపెట్టారు. ఆసంవత్సరం కమ్యూనిస్టువారు తమ కార్యక్రమాన్నిగూర్చి ప్రకటించిన మేనిఫెస్టోలో ఈవిధంగా వ్రాశారు:

"గాంధీజీయున్నూ, ఇంకా ఇతరనాయకులున్నూ చేస్తూన్న దౌర్జన్యరహిత ప్రచారంవల్ల బ్రిటిషురాజ్యాన్ని ధిక్కరించడానికి భారతప్రజలు ఆయుధాలతో విప్లవాన్ని తీసుకరాలేకపోయారు........ఈనాడు గాంధీజీ

'రైతుకూలీలు యజమానులమీద తిరుగుబాటు చేయకూడ'దని చెప్పుతున్నాడు. సరిహద్దురాష్ట్రములోనూ, ఇంకా దేశములో ఇతర ప్రాంతాలలోనూ బ్రిటిషుప్రజలు బహిరంగముగా యుద్ధము సాగిస్తూంటే గాంధీజీ ఈవిధముగా, ఈసమయములో చెప్పుతున్నాడు." అంటూ, అందులోనే "ఇండియన్ నేషనల్‌కాంగ్రెసు మాయలో ప్రజలు పడిపోయినందువలననూ, ధనాఢ్యులున్నూ, పెట్టుబడిదారులూ ప్రతినిధు లగుటవలననూ, ఆ కాంగ్రెసుసంస్థ కష్టపడి పనిచేసే జనసామాన్యపు ఆశయాలకు విరుద్ధము అయినందువలననూ జయప్రదమైన విప్లవము రావడానికి వీలులేకపోయింది. 1920–21 లలో ప్రజాపోరాటాన్ని కాంగ్రెసు చిందరవందర చేసింది." అని ఆరోజు కమ్యూనిస్టుపార్టీ అన్నది. ఇందులో సత్య మెంత మాత్ర మున్నదో మనం ఆలోచించాలి.

వీరు మేనిఫెస్టోలో వ్రాసినదాన్నిబట్టి చూస్తే ఆయుధాలతో విప్లవం రావాలన్నట్లు అర్థమౌతోంది. పైగా దౌర్జన్యరాహిత్యపద్ధతితో గాంధీజీ బ్రిటిషురాజ్యాన్ని ధిక్కరించకుండా చేశా డన్నారు. ఈయనవల్ల జయప్రదమైన విప్లవం రాలేకపోయిందని వ్రాస్తున్నారు.

గాంధీజీ అసామాన్యమైన వ్యక్తి. దూరదృష్టి కలవాడు. ప్రపంచమంతా ఆయన్ను గౌరవిస్తున్నదంటే కొల్లాయి కట్టుతా డనీ కాదు— బారిష్టర్ అనీ కాదు—బ్రహ్మాండమైన వక్తా, రచయితా అనీ కాదు; అతనిలో మూర్తీభవించిన అహింసా, శాంతి, సత్యాగ్రహతత్వాలే కారణాలు: ఈ మూడే గాంధీజీని మేరుశిఖరాల్లో కూర్చోబెట్టింది. ఎప్పుడూ స్వాతంత్ర్యంకోసం నిప్పులుగ్రక్కుతూండే సర్దారుపటేల్, నెహ్రూలాంటి వారిని సైతం ఈ శక్తిత్రయంతోనే తన ఆజ్ఞాబద్ధులనుగా చేసికోగలిగాడు గాంధీజీ. ఆయుధశాసనం మన దేశములో 20-వ శతాబ్దానికి లోపుగానే పెట్టబడిందని తెలిసికోకుండా ఆయుధాలతోటీ, దౌర్జన్యంతోటీ విప్లవం





లేవనెత్తాలని కమ్యూనిస్టు లన్నట్లు గాంధీజీ ప్రయత్నించి వున్నట్లైతే అతని వ్యక్తిత్వం సంపూర్ణంగా కోల్పోవటమేకాక, భారతజాతి కొన్ని శతాబ్దాలవరకు జీవచ్ఛవమైపోయేది. బ్రిటిషుసామ్రాజ్యం స్థిరపడకుండా వుండటమేకాక ఇండియాలో ఈస్టిండియాకంపెనీక్రిందే పరిపాలన సాగుతూన్న సమయాన, ఏ ఆయుధశాసనాలూ లేని రోజుల్లో మన దేశాన వచ్చిన "సిపాయిపితూరీ" మందుగుండ్ల ధాకకు తట్టుకోలేకపోయింది— దేశమంతా అరాజకంతో నిండిపోయింది. పరిస్థితుల్ని గమనించకుండా కమ్యూనిస్టులు ఆయుధాలతోటి విప్లవం కావాలనటం ముందుచూపు లేని మాట. మన దేశములో ఆయుధాలతో విప్లవము వచ్చే స్థితేగనుక వుంటే కాంగ్రెసుకాకున్నా మరోసంస్థ తయారయ్యేది. కమ్యూనిస్టులు తరతరాలుగా ప్రయత్నించినప్పటికీ ఆయుధవిప్లవం రాదు—రావటానికి వీలులేదు. ఈ పరిస్థితుల్ని బాగా గమనించే గాంధీజీ అహింసా, శాంతి, సత్యాగ్రహమనే ఆయుధాలతో రాజకీయ సమరాంగణ నాయకత్వం వహించాడు. ఆయన్నూ, ఆయనసిద్ధాంతాలనూ తరచితరచి చూచిన మహామహులే ఆయనఉద్యమానికి తలయూపారు. ఈ మాటివల్లనే ఆయన ఈ విశాల ప్రపంచంలో ఒక విశిష్టవ్యక్తిత్వం సంపాదించుకొన్నాడు—నిర్విఘ్నంగా భారత జాతీయసమరం సాగించగల్గుతున్నాడు. అమెరికాలోని సుప్రసిద్ధ రచయిత లూయీఫిషర్ "విదేశయాత్రికుల్ని ఇండియా ఆకర్షించేది మూడు చిత్రాలు. అందులో ఒకటి మహాత్మాగాంధీ, రెండవది తాజ్‌మహల్, మూడోది గౌరీశంకర శిఖరం" అని తాను వ్రాసిన "గాంధీతో ఒక వారం" అనే గ్రంథంలో వ్రాశాడు. దౌర్జన్యరాహిత్య మనేదే అతని ఉద్యమానికి జీవగఱ్ఱ. ఇదే భారతదేశానికి అభ్యుదయపంథా!

ఇండియన్ నేషనల్ కాంగ్రెసుమాయలో ప్రజలు పడిపోయారనీ, కాంగ్రెసు ధనాఢ్యులా, పెట్టుబడిదారులా ప్రతినిధి అగుటవలన కష్టపడి

పనిచేసే జనసామాన్యాశయాలకు విరుద్ధమయినందువల్ల జయప్రదమైన విప్లవం రావటానికి వీలులేకపోయిందనీ అన్నారు. పైగా 1920-21 లోని ప్రజాపోరాటాన్ని కాంగ్రెసు చిందరవందరచేసిం దంటున్నారు.

పైన కాంగ్రెసుమాయలో ప్రజలు పడిపోయారంటూ, క్రింద జనసామాన్యాశయాలకు కాంగ్రెసు విరుద్ధమైన దంటున్నారు. దీన్నిబట్టి వీరు 'ప్రజా' పదప్రయోగానికి ఏమర్థం చెప్పుతారు? 'ప్రజ' అనేదాంట్లో తెగలేమైనా వున్నాయా? పూర్వాపరవిరుద్ధంగా వున్న వీమాటలు. జనసామాన్యాశయాలకు కాంగ్రెసు ఎన్నడూ విరుద్ధం కాలేదు. కాంగ్రెసుకు కావలసిందే వాండ్ల బలగం—ఉన్నదే వారి బలగం! కాంగ్రెసు ధనాఢ్యులకూ, పెట్టుబడిదారులకూ ప్రతినిధిగా వున్న దంటున్నారు. కాంగ్రెసు భారతదేశదాస్యవిమోచనంకోసం పాటుపడుతూన్న సంస్థ. ఈ ఉద్దేశం కలవాళ్ళందరికీ ఇందులో స్థానమున్నది. జనసామాన్యంనుండి ఎన్నుకోబడ్డవారే ప్రతినిధు లౌతున్నారుకాని, ధనాఢ్యులైనంతమాత్రంతోనే కాంగ్రెసులో పలుకుబడి, ప్రతినిధిత్వం సంపాదించటంలేదు. బీహారులో భూకంపం వచ్చిందంటే ధనాఢ్యులవద్ద డబ్బు ప్రోగుచేసి దరిద్రులకు పంచిపెట్టింది. ఏ రాజకీయసంస్థకైనా అంగబలంతోపాటు అర్థబలంకూడా అవసరము.

పచ్చి అబద్ధం చెప్పేందుకుకూడా కమ్యూనిస్టులు సాహసించారు. అసలు ప్రజోద్యమం లేవనెత్తిందే కాంగ్రెసు అవుతే చిందరవందర ఎందుకుచేస్తుంది? 1920-21 లో కాంగ్రెసు తెచ్చిన ప్రజోద్యమాన్ని చిందరవందరచేసింది బ్రిటిషువారి ఏజంట్లూ—బ్రిటిషువారూ.

కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఏదో ఒక పార్టీ ఈవిధంగా బయలుదేరటంవల్లనే అది తలపెట్టిన ప్రతిఉద్యమమూ దెబ్బతింటూ వచ్చింది. జనసామాన్యాశయాలకు విరుద్ధమైనందువల్ల కాంగ్రెసుద్వారా సరియైన





విప్లవం రాలేకపోయిం దంటున్నారు. 1921-వ సంవత్సరంలో 30 వేలమంది జైళ్లకు వెళ్లారు. 1930 లో 60 వేలమంది. 1932-33 లలో లక్ష ఇరవై వేలమంది జైళ్లకు పోయారు. కమ్యూనిస్టులు చెప్పుతూవున్నట్లైతే ధనాఢ్యులూ, పెట్టుబడిదారులూ ఏ నూర్లసంఖ్యలోనో జైలుకు వెళ్ళివుంటారు. తక్కినదంతా జనసామాన్యమే!

1939-వ సంవత్సరంలో యుద్ధం ప్రారంభమైంది. ఆనాటికి కాంగ్రెసువారు ఏడురాష్ట్రాల్లో అధికారములో వున్నారు. ఈ యుద్ధానికి బ్రిటిషువారి సామ్రాజ్యతత్వమే ప్రధానంకాని, ప్రజాస్వాతంత్ర్యం ప్రధానం కాదని వర్ధాలో కాంగ్రెసు వర్కింగుకమిటీవారు తీర్మానించారు. అవసరమని తోచినపక్షాన మంత్రిపదవులకి రాజీనామా లివ్వాలన్నారు. యుద్ధమును గూర్చి బ్రిటిషువారి ఆశయా లేమిటో తెలుపమని కాంగ్రెసు ప్రభుత్వాన్ని కోరింది. 1939 అక్టోబరు నెలలో రాజప్రతినిధిప్రకటన బ్రిటిషువారి సామ్రాజ్యపంథాతోనే బయటపడింది. దాంతో కాంగ్రెసువారు తమ మంత్రిపదవులకి రాజీనామా ఇచ్చారు. భారతీయులకూ, ఈయుద్ధానికీ ఏలాంటి సంబంధంలేదని కాంగ్రెసు ఉద్ఘాటించింది. భారతదేశంనుండి యుద్ధానికి ధన, సైనిక సహాయం జరుగకూడదనీ, బ్రిటిషువారి బలాత్కారాన్ని అరికట్టాలనీ కాంగ్రెసు 1940 లో వ్యష్టిసత్యాగ్రహం ప్రారంభించింది. ఆ తరుణంలో చాలామంది కాంగ్రెసువాదులు యుద్ధవ్యతిరేక ప్రచారంకోసం జైళ్ళకు వెళ్ళాల్సివచ్చింది.

ఆనాడు బ్రిటిషువారికి కమ్యూనిస్టులు వ్యతిరేకంగా వుండినారు. కమ్యూనిస్టుపార్టీ అశాస్త్రీయసంఘంగా వుండటంవల్లనూ, ఇం. దే. ర. చట్టంవల్లనూ కమ్యూనిస్టులు బాహాటంగా ఏమీ చేయలేని స్థితిలోకి వచ్చారు. కమ్యూనిస్టులది పూర్తిగా రహస్యోద్యమ మైపోయింది. కాంగ్రెసుకు దేశంలోవుండే పలుకుబడిని చూచి కాంగ్రెసులో అధికారాన్ని

సంపాదించి నిజాతీ అయిన ప్రజోద్యమాన్ని లేవదీయాలనే నిర్ధారణలోకి వచ్చారు.

అప్పుడు బెంగాలు కమ్యూనిస్టుపార్టీ "స్వాతంత్ర్యంకోసం యుద్ధానికి విరుద్ధోద్యమము కాంగ్రెసు తలపెడితేనే జాతి జాతి అంతా పాల్గొంటుంది. కాంగ్రెసు ప్రజోద్యమాన్ని నడిపితేనే ప్రయోజనకరముగా వుంటుంది. ఏది ఏమయినప్పటికీ ఇది ఒప్పుకొనకతప్పదు"అని ప్రకటించింది. దీన్నిబట్టి కాంగ్రెసు వ్యష్టిసత్యాగ్రహం చేయతలపెడితే సమష్టిప్రజాసమరం కావాలని కమ్యూనిస్టులు కోరినట్లు మన కర్థమవుతున్నది. అందువల్ల కమ్యూనిష్టులు కాంగ్రెసులో చేరి, ప్రజోద్యమం రాగానే దేశంలో వ్యాపించిన తరువాత ఆయుధవిప్లవం తీసుకరావచ్చుననీ, ఆ దూకుడులో గాంధీజీ వద్దన్నా-మరెవ్వరు కాదన్నా విప్లవం తీవ్రరూపం తాల్చుతుందనీ నిర్ణయించుకొని కాంగ్రెసులో ప్రవేశించటం మొదలుపెట్టారు. దీన్నిబట్టి కాంగ్రెసు తీసుకవచ్చే ప్రజోద్యమాన్ని ఆధారంగా చేసికొని దౌర్జన్యయుత విప్లవం తీసుకరావాలని కమ్యూనిస్టుల అభిప్రాయమైనట్లు 1940 లో స్పష్టమౌతున్నది.

1939 లో కాంగ్రెసు బ్రిటిషువారితో రాయబారానికి తలపెడితే బ్రిటిషువారితో ఏవిధమైన రాజీపద్ధతికాని, రాయబారాలు కాని అక్కరలేదని కమ్యూనిష్టులు వాదించారు. 1940 లో వ్యష్టిసత్యాగ్రహం ప్రారంభిస్తే "ఇది పనికిరాదు. ప్రజోద్యమమే (సమష్టిసత్యాగ్రహమే) కావా" లని వాదించి వ్యష్టిసత్యాగ్రహంలో పాల్గొనలేదు.

టెర్రరిస్టుల ఉద్యమం బెంగాలు, పంజాబుప్రాంతాలలో కొంత కాలంపాటు సాగింది-కడకు చప్పబడిపోయింది. ఆ టెర్రరిస్టు ఉద్యమంతో సంబంధంవున్న చాలామంది 1933 తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరారనే విషయం ఇక్కడ మరచిపోకూడదు.





కాంగ్రెసువారు ఏమి చేయబూనుకున్నా ఏదో డొంకతిరుగుడు సాకులు పెట్టి ఆఆ ఉద్యమాల్లో పాల్గొనకుండా మన కమ్యూనిస్టులు తప్పుకుంటూవచ్చారు. రహస్యంగా తమ విప్లవోద్యమాశయాలను కొద్దిమంది పార్టీసభ్యులతో పత్రికలద్వారా ప్రచారం చేసికొనేవారు. ఆ పత్రికలు ఎక్కడ అచ్చయ్యేదీ తెలిసేది కాదు. పార్టీసభ్యులకు ప్రత్యేకవ్యక్తుల ద్వారా అందజేయబడుతూండేవి. రైళ్ళలో ఈ పత్రికల్ని ఎత్తుకపోతూన్న వ్యక్తు లక్కడక్కడా పట్టుబడేవారు. వీలుంటే పోలీసుల్ని మాయచేసి తప్పించుకపోయేవారు—లేదా జైళ్ళకు వెళ్ళేవారు. అక్కడనుండీ, అవకాశముంటే, తప్పించుకొనేవారు.

యుద్ధం వచ్చినతరువాతకూడా పార్టీలో ఏమార్పున్నూ రాలేదు. పార్టీ రహస్యంగా ప్రచారమౌతూండేది. జర్మనీ రష్యాపై యుద్ధం ప్రకటించింది. అప్పటినుండి వీరి విధానంలో మార్పు కొంత గోచరింపసాగింది. ఉన్నట్లుండి హఠాత్తుగా 1942 లో తమ పార్టీ ఆశయాల్ని మార్చుకున్నారు. జనవరి 5-వ తేదీన పాట్నాలో ఒక విద్యార్థిఫెడరేషన్ జరిగింది. దానిలోని కమ్యూనిస్టులు పాల్గొని తమ పితృదేశమైన (పితృదేశమని వీరు భావిస్తున్నారు. కాని, రష్యావారికి ఈ భారతకమ్యూనిస్టుపార్టీపైన ఏమాత్రం అభిమానంలేదనే విషయం ఒకమారు బయటపడ్డది.) రష్యా కీ యుద్ధంతో సంబంధ ముండటంవల్లా, రష్యాకమ్యూనిజం బ్రిటిషువారి ఇంపీరియలిజంతోటీ, అమెరికాకేపిటలిజంతోటీ చేతులు కలపటంవల్లా (నిజంగా ఇది కమ్యూనిజానికి పెద్దదెబ్బ! పరిస్థితుల ననుసరించి ఆపర్చ్యునిస్టయిన స్టాలిన్ జన్మద్వేషమైన సామ్రాజ్య, పెట్టుబడి తత్వాలతోటి సహకారం పొందవలసివచ్చింది.) పూర్వం బ్రిటిషువారిపై వున్న ద్వేషం ఒక్కమారు మైత్రిగా పరిణమించింది. ఆ ఫెడరేషన్‌లో ఇది "ప్రజాయుద్ధము" అని బహిరంగంగా తీర్మానించారు.

ఇటలీఫాసిజానికి ఎదుర్కోవడంలో అబిసీనియా ఇబ్బందులు పడుతూన్నప్పుడూ, జపాన్ ఇంపీరియలిజంబారినుండి తప్పించడానికి చైనా యుద్ధంచేసేటప్పుడూ, ఫ్రాంకోనిరంకుశత్వాన్ని స్పెయిన్ దేశభక్తులు ఎదిరించేటప్పుడూ, పోలెండును జర్మనులు అణగద్రొక్కేటప్పుడూ మన కామ్రేడుల "ప్రజాయుద్ధ" నినాద మెందుకు పుట్టలేదు?

ఇంతమాత్రంతోనే బ్రిటిషువారు ఉబ్బితబ్బిబ్బులై కమ్యూనిస్టు పార్టీని సక్రమసంస్థగా ప్రకటించలేదు. భారతీయులలో ఏపార్టీకి చెందిన వారినైనప్పటికీ తమకు సహకారం చేస్తామన్నంతలోనే బ్రిటిషుప్రభుత్వం శీలం శంకించకుండాపోదు. అందులోనూ కమ్యూనిస్టులంటే మరిన్ని చెడ్డ అనుమానం. అటుపిమ్మట వారికీ, వీరికీ ఏదో ఒక ఖండితమైన ఒడంబడిక కుదిరేందుకు ఆరుమాసాలు పట్టవలసివచ్చింది. ఈ రాజీ సందర్భాల్లో సర్ ఫిరోజ్‌ఖాన్‌నూన్ గవర్నమెంటు తరపున మధ్యవర్తిత్వం చేసినట్లు అర్థమౌతోంది. ఇతడు వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబరుగా వుండేవాడు. ఇతని కీ విషయంలో ప్రసక్తి లేకున్నపక్షంలో జూలై 19-వ తేదీన "కమ్యూనిస్టులు నిజమైన జాతీయవాదులు. వారు కాంగ్రెసుఉద్యమానికి సాయముచేయరు" అని ప్రకటించాల్సినట్టి అవసర ముండేదికాదు. (1945 అక్టోబరు 14-వ తేదీన 'పీపుల్సువార్' లో సర్‌నూనుపై కూడా కారాలూ, మిరియాలూ నూరారు.)

19-వ తేదీ సర్ నూన్ ఈమాటలు చెప్పాడు. 42 జూలై 23-వ తేదీన భారతప్రభుత్వంవారు కమ్యూనిస్టుపార్టీపై పెట్టిన నిషేధం తొలగించారు. ఆరోజునుండి భారతకమ్యూనిస్టుపార్టీ సక్రమసంస్థ అయింది. నిషేధాజ్ఞను రద్దుచేస్తూ ప్రభుత్వంవారు ప్రకటించిన ప్రకటనలో "యుద్ధానికి కమ్యూనిస్టుపార్టీవారు సహాయంచేస్తామనటంవల్ల దానిపై వున్న నిషేధాజ్ఞను తొలగిస్తున్నా" మని వివరించారు.





1942 ఏప్రిల్‌లో క్రిప్సురాయబారాలు విఫలమయ్యాయి. దీనితో దేశంలోనూ, కాంగ్రెసులోనూ విపరీతమైన అసంతృప్తి బయలుదేరింది. కాంగ్రెసు గొప్ప ప్రజోద్యమం లేవనెత్తాలనుకొని, ఆనాడు రాజప్రతినిధిగావున్న లార్డు లిన్‌లిత్‌గోకు తెలిపింది. బొంబాయిలో ఆగస్టు 7, 8 తారీకులలో ఎ. ఐ. సి. సి. సమావేశమైంది. ఎనిమిదవ తేదీనాడు "క్విట్ ఇండియా" (ఇండియానుండి వైదొలగండి) తీర్మానం ఆమోదింపబడింది. ఎటువంటి ఉద్యమం, ఏపద్ధతిలో తీసుకరావాలనేవిషయం 9-వ తేదీన చర్చింతా మనుకున్నారు. కాని, 8-వ తేదీరాత్రి తెల్లవారుఝాముననే వర్కింగుకమిటీ మెంబర్లు అరెస్టుచేయబడ్డారు. అఖిలభారత కాంగ్రెసుకమిటీ సభ్యుల్నంతా 9-వ తేదీనుండి అరెస్టుచేయటానికి మొదలుపెట్టారు. ఈ అరెస్టులతో దేశం అట్టుడికినట్లు ఉడికిపోయింది. బొంబాయి నగరంలో ఆవార్త విన్న క్షణంనుంచి విధ్వంసక కార్యకలాపాలు విజృంభింపసాగాయి. ప్రభుత్వము కఠినమైన దమననీతితో ఈ ఉద్యమాన్ని అణచేందుకు ప్రయత్నింపసాగింది.

కాంగ్రెసు ప్రజోద్యమాన్ని తీసుకురాలేకపోయిందని కమ్యూనిస్టులు విమర్శిస్తూవచ్చారు. తలవనితలంపుగా వచ్చిన ఈ పరిస్థితికి సమష్టిశాసనోల్లంఘనం (లేదా—సత్యాగ్రహం) కోసం ఎదురుచూస్తూన్న ప్రజాసముదాయం ఉడుకెత్తి ఉద్యమాన్ని తీవ్రవిధ్వంసకచర్యలరూపంలో నడిపి దేశమందంతటా బాహాటమైన ప్రభుత్వధిక్కారం సాగించింది. కమ్యూనిస్టులు విప్లవంకోసం-అందులో సాయుధవిప్లవంకోసం, ఎదురుచూస్తుంది భారతదేశమంతా మహావిప్లవంతో నిండిపోయినట్టిరోజుల్లో తోకముడిచారు. దీనికి కారణం బ్రిటిషుప్రభుత్వంతో చేతులుకలపటమే! అంతటితో ఊరకుండక ఉద్యమంలో పాల్గొన్నవారినీ, ఈ ఉద్యమానికి ఏమీ సంబంధంలేని గాంధీజీనీ, కాంగ్రెసుసంస్థనీ [illegible]

TL
VBI,4.N24
152054

అఖిలభారతకమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి పి. సి. జోషీ నాయకుల అరెస్టు జరిగినవెంటనే 9-వ తేదీన "కాంగ్రెసు హింసాత్మకపోరాటము సాగించమనలేదు. ఏ. ఐ. సి. సి. వారు శాసనోల్లంఘన కార్యక్రమం నిర్ణయించలేదు. అరాజకాన్నీ, దౌర్జన్యాన్నీ కాంగ్రెసుకాని, మహాత్ముడు కాని ప్రతిపాదించలేదు." అని ప్రకటించాడు. కమ్యూనిస్టుపార్టీవారు ప్రభుత్వంతో మిలాఖత్‌కావటంవల్ల విప్లవంకోసం ఎన్నాళ్లగానో ఎదురు చూస్తుండి సమయం వచ్చేసరికి ప్లేటుమార్చారు. కమ్యూనిస్టువారిని గాంధీ తీసుకరాబోయే ఉద్యమాన్ని అణచేందుకే వదిలామని భారత ప్రభుత్వంవారి లేబర్ వెల్ ఫేర్ ఆఫీసరుగారైన నింబకర్‌గారు బహిరంగముగా ప్రకటించినాడు. ఈ వర్తమానము అసోసియేటెడ్ ప్రెస్‌వారు 23-7-42 వ తేదీన తెలియజేశారు. ప్రజోద్యమం కాంగ్రెసు తలపెట్టనప్పుడు ఉద్యమం కావాలన్నారు. హఠాత్తుగా ఉద్యమం వచ్చినప్పుడు ఇది ఇప్పుడు అవసరం కాదన్నారు. ఇట్లా వున్నది భారతకమ్యూనిస్టు పార్టీ తత్వం!

## 3

## 1942 ఆగస్టు 9—1945 సెప్టెంబరు.

దేశములో అన్నిప్రాంతాలలోనూ అల్లర్లు ప్రారంభమైనాయి. కాంగ్రెసు నాయకులంతా అరెస్టుచేయబడ్డారు. ప్రజానాయకత్వం వహించే వ్యక్తులు లేరు. ప్రజల్లో గొప్ప సంచలనం కలిగింది. ఎవరి మనస్సుకేది నచ్చితే వారు దాన్ని ఆచరించేవారు. ట్రెజరీలు కొల్లగొట్టబడ్డవి. గవర్నమెంటు ఆఫీసులు, రికార్డులు, రైలుపెట్టెలు, రైల్వేస్టేషన్లూ తగలబెట్టారు. టెలిగ్రాం తీగెలు తెంపారు. ఇంకా ఎన్నోరకములైనట్టి విధ్వంసకరచర్యల్ని జరిపింది భారతదేశప్రజ.





దీనికంతా కారణం వారివారి ఉద్రేకమే! ఈ హడావిడినంతా ఘోరమైన దమననీతితో అణచసాగింది బ్రిటిషుప్రభుత్వం: కాల్పులవల్ల చాలామంది మరణించారు. దేశమంతా మిలిటరీ వాతావరణంతో దద్దరిల్లిపోయింది. కాంగ్రెసు పుట్టినప్పటినుండి ఇంతటి మహావిప్లవం రాలేదు. దీనితో కాంగ్రెసుప్రతిష్ఠ మహోన్నతశిఖర మందుకొన్నది. ఎందుకొఱకు? ఎలాంటి సూచనలూ కాంగ్రెసు చేయనప్పుడే ఇంతటి విప్లవం వచ్చిందికాబట్టి, కాంగ్రెసేగనుక సూచించివున్నట్లయితే ఇంకెంతటి మహావిప్లవం వచ్చేదో ననే అంశంపైన.

ప్రభుత్వంవారు కేంద్రప్రభుత్వోద్యోగియైన టాటన్హాంతో "ఆగస్టు అల్లరులకు కాంగ్రెసుబాధ్యత" అనే పుస్తకం వ్రాయించారు. ఇందులో అల్లరుల బాధ్యతంతా కాంగ్రెసుమీద వేసి కాంగ్రెసును ఎన్ని రకాలుగా దూషించటానికి వీలౌతుందో అన్నిరకాలుగా దూషించాడు టాటన్హాం. గాంధీగారీగ్రంథాన్ని ఖండిస్తూ "అల్లరులకు కాంగ్రెసుబాధ్యత ఏమీ లేదు —ప్రజల ఉద్రేకమే దానికి కారణ"మని అనాడు లిన్‌లిత్‌గోకు తెలిపాడు.

తలవనితలంపుగా కమ్యూనిస్టులకు చాలాగొప్పఅవకాశం లభించింది. ప్రజలు భయభీతులైవున్నారు. నాయకు లెవరూ లేరు. ఈ అవకాశం బాగా వినియోగించుకోవాలని కమ్యూనిస్టులు నిర్ణయించుకున్నారు. ముఖ్యముగా పార్టీప్రచారానికి పేపర్లూ, పుస్తకాలూ అవసరమని పేపర్లు పెట్టారు—పుస్తకప్రచురణకి ప్రారంభించారు. తమ ప్రచారం సాగేందుకు కాంగ్రెసును దూషిస్తేనేకాని లాభంలేదని దూషణకు నడుంకట్టారు. "కాంగ్రెసు మొదటినుండీ జాతీయపోరాటాన్ని సక్రమమైన పద్ధతుల్లో నడిపించటం లేదు. కాంగ్రెసు సంఘటితపరచే జాతీయపోరాటం భారతజాతిఅభివృద్ధికరముగ లేకపోవటమేకాక భారతజాతికి వినాశకరముగనున్నది" అని గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ సభలుచేస్తూ ఈవిధమైన దుష్ప్రచారం చేయసాగారు.

ఆగస్టు 9 వ తేదీన జోషీ చేసిన ప్రకటనలో అరాజకాన్నీ, దౌర్జన్యాన్నీ కాంగ్రెసుకాని, మహాత్ముడుకాని ప్రతిపాదించలే"దన్నారు. ఆ

మాటన్న వీరే జాతీయపోరాటాన్ని కాంగ్రెసు సరిగ్గా నడిపించ లేదంటున్నారు. దీన్నిబట్టి కమ్యూనిస్టుపార్టీవారు ఏఎండ కాగొడుగు పట్టే వారని స్పష్టమౌతున్నది. దేశాన్నీ, ప్రజల్నీ ఎన్నిరకాలుగా, ఏఏనినా దాలతో, ఏఏజెండాలతో, ఏఏఉద్యమాలతో మోసపుచ్చాలో్నో ఆఅవిధంగా మోసపుచ్చారు—తీరని ద్రోహం చేశారు.

పాకిస్థాన్ వాదం:—

పూర్వం వీరు పాకిస్థాన్‌వాదాన్ని బాగా వ్యతిరేకించారు. జిన్నాగారి పాకిస్థాన్‌వాదం అభ్యుదయనిరోధకవాదమని విమర్శించివున్నారుకూడా. నేడు జిన్నా 'వాదము' సక్రమమైనదేననీ, కమ్యూనిజానికీ పాకిస్థానుకూ దగ్గరసంబంధం వున్నదనీ ప్రచారంచేస్తున్నారు. ఈవిషయాన్ని తీవ్రంగా ఖండిస్తూ క్వాజాఅహమ్మద్‌అబ్బాస్‌గా రొక వ్యాసం వ్రాశారు.

జిన్నాగారు, కాంగ్రెసులో వుండగా, హిందూ-ముస్లింఐక్యతకోసం చాలా ప్రయత్నించినవారిలో ఒకడు. అటువంటి జిన్నా నేడు హిందువులపై మంటలుగ్రక్కుతూ మొన్నటి రంజాన్‌సందేశంలో అభిప్రాయ గర్భితంగా లీగులో చేరని ముస్లిం ఇస్లాంమతానికే వ్యతిరేకి అనీ, మహమ్మద్‌ఉద్దేశాలకే భిన్నుడౌతాడనీ లీగ్‌లో చేరని ముస్లింలనుగూర్చి తెలిపాడు. దీన్నిబట్టి జిన్నా మతంపేరుతో లీగును బలపరచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమౌతున్నది. అటువంటప్పుడు మత, కుల తత్వాలకి ఆ బద్ధవైరులైన కమ్యూనిస్టులు లీగును బలపరచటం శుద్ధతప్పు.

జిన్నా కోరే 'పాకిస్థాన్' అనర్థదాయకమైంది. ఈకోర్కె సవ్యమైనదేనని (కమ్యూనిస్టులు తప్ప) ఎవ్వరూ అనటంలేదు. ఇంగ్లండులోని అరబ్బులుకూడా పాకిస్థాన్‌కు వ్యతిరేకులమని స్పష్టంగా ప్రకటించారు. మన భారతదేశంలో సప్రూ, జయకర్, శ్రీనివాసశాస్త్రిలాంటి నిష్పక్షనాయకులుకూడా భారతాఖండతను విడదీసే పాకిస్థాన్‌వాదాన్ని ఆమోదించటం లేదు. ఆర్థికంగానూ, పారిశ్రామికంగానూ స్వయంపోషణకు అనువైన స్థితిలో పాకిస్థాన్ వుండదని ఆర్థికశాస్త్రవేత్తలు బహి





రంగంగా చాటుతున్నారు. అసలు ముస్లింలలోకూడా ఒక లీగుపార్టీ తప్ప తక్కిన ఖాక్సార్లు, మోమీన్లు, షియాలు, అహ్రార్లు మొదలైన వారంతా ఏకగ్రీవంగా అఖండహిందూస్థానంలోనుండి వేరుపడేందుకు ఒప్పుకోమంటున్నారు.

ఈ పాకిస్థాన్ కోరటంలో ఎంతటి న్యాయమున్నదో మనం గమనించాలి. హిందూదేశంలో వున్నట్టి ముస్లింల సంఖ్య 9 కోట్లా 40 లక్షలు. ఇందులో స్వదేశ సంస్థానాల్లో 2 కోట్లా 40 లక్షలు వున్నారు. మూడు కోట్లమంది తదితరరాష్ట్రాల్లో వున్నారు. వీరంతా పోగా పాకిస్థాన్ కావాలంటున్న బెంగాల్, పంజాబ్, సింధు మొదలగు ప్రాంతాల్లో నాల్గు కోట్ల ముస్లింలు వున్నారు. ఈ నాల్గుకోట్ల ముస్లింలకే పాకిస్థాన్ ఇవ్వాలంటున్నాడు జిన్నాసాహెబ్. ఈ నాల్గుకోట్ల ముస్లింలలో ఒక లీగ్‌మాత్రమేకాక, ఖాక్సార్లు, షియాలు, అహ్రార్లు మొదలైన పార్టీలున్నవి. ఈ పార్టీలవారంతా జిన్నావాదానికి వ్యతిరేకమేకదా! పై పరిస్థితుల్ని మనంగమనించినపక్షంలో జిన్నావాదం ఎంత అసందర్భంగా వున్నదీ, ఎంత లోపభూయిష్ఠంగా వున్నదీ మన కర్థమౌతూన్నది. ఇల్లాంటి అవకతవకవాదాన్ని కమ్యూనిస్టులు బలపరచటంవల్ల వీరి అవివేకం బయటపడ్డది.

అనేకకారణాలవల్ల పాకిస్థాన్‌వాదము అసమంజసముగ నున్నది. జనాబ్‌జిన్నా ముస్లింలను ఒక ప్రత్యేకజాతిగా పరిగణించమంటున్నాడు. భారతదేశంలో ద్విజాతిసిద్ధాంతం ఖాయపరచాలని ప్రయత్నిస్తున్నాడు. ఇతని వాదానికి జాతీయదృష్టితోనేకాక, అంతర్జాతీయదృష్టితో చూచినప్పటికీ తగిన సమాధానం లభించదు. ఇంగ్లండునందు వోటరులు ఎన్నికల్లో ఇంగ్లీషువారుగానే వోట్లు ఇస్తున్నారుకాని, కాథలిక్కులుగానూ, ప్రెస్‌బిటేరియన్సుగానూ మతాలవారీగాఇవ్వటం లేదు. మన దేశంలో ముస్లిం, హిందూనియోజకవర్గా లేర్పడ్డవి. బ్రిటిషుప్రభుత్వం మన దేశంలో మొదటినుండి అవలంబిస్తూన్నట్టి చీలదీసేపద్ధతి (Divide and rule) వల్లనే మనకు తీర్చనలవికాని సమస్యలు ఒకదానివెంట ఒకటి వస్తూన్నవి.

'45 అక్టోబరు 29 వ తేదీన బర్మాజాతీయనాయకుడు ఆంగ్ సేన్ సహా పాకిస్థాన్ అసమంజసమైనదని ప్రకటించాడు. ఈకారణాల్ని అన్నింటినీ బాగా ఆలోచించకుండా భారతకమ్యూనిస్టులు పాకిస్థాన్‌వాదాన్ని బలపరచటం తప్పు. జిన్నా అడుగుతున్నాడని పాకిస్థాన్ ఇచ్చేట్లయితే—సిక్కులు సిక్కుస్థాన్ కావా లంటారు—ద్రవిడులు ద్రవిడస్థాన్ కావాలంటారు—ఆంధ్రులు ఆంధ్రస్థాన్ కావాలంటారు—డా. బి. ఆర్. అంబేద్కర్ 'నిమ్నజాతిస్థాన్' కావాలంటాడు—కమ్యూనిస్టులు 'రష్యాస్థాన్' కావా లంటారేమో! జిన్నాకోర్కె సక్రమమైనదేనని మనం ఒప్పుకుంటే వీరి వీరి కోర్కెల్నికూడా మనం అంగీకరించక తప్పదు. భారతదేశంలో ఇన్ని 'స్థాన్'లను పంచిపెట్టితే తుదకు మనకు లభ్యమయ్యేది బ్రిటిషువారి అజమాయిషీలో వుండే దాస్యస్థానమే!

రెండు మాసాలక్రింద కరాచిలో ఒక ముస్లింపత్రికావిలేఖరి జిన్నా గారిని 'పాకిస్థాన్' అంటే ఏమిటో సెలవిమ్మన్నాడు. జిన్నా దానికేమీ సరియైన జవాబు చెప్పలేకపోయాడు. తను పాకిస్థాన్‌విషయంలో సరియైన అభిప్రాయం (Idea) ఏర్పరచుకోలేదని బహిరంగపరచాడు. ఈసంఘటననుబట్టి పాకిస్థాన్ అంటే ఫలానాఅని జిన్నా అనుకోకుండా, నినాదంగామాత్రమే ఉపయోగపరచుకొంటున్నాడని మన కర్థమౌతున్నది.

కైదేఅజామ్ తన ఏకైకనాయకత్వంతోనే పాకిస్థాన్ సాధించాలని కోరుతున్నాడు. ప్రజాభిప్రాయంతో పనిలేదంటాడు. గాంధీ–జిన్నా సమావేశం భగ్నంకావటానికిదే (ప్లెబిసైట్-Plebiscite) ముఖ్యకారణమని మనం తెలిసికోవాల్సివుంటుంది.

సిమ్లాలో జిన్నాకోర్కెలు ఉచ్చస్థాయిలోకి పోయాయి. ఇతని మంకుతనం అందరికీ అసహ్య మనిపించింది. ఆ ఊపులోనే "ఇండియాను పాలించేది వేవెలా, జిన్నానా?"అని జయకరూ, ఇంకాకొందరు నిష్పక్షనాయకులూ ఆగ్రహావేశపరులై ఒక ప్రకటన చేశారు.

ఎన్నికలకోసం డబ్బు వసూలుచేస్తూ, మొట్టమొదట బొంబాయిలో కాంగ్రెసునూ, గాంధీజీనీ తిట్టిపోశాడు జిన్నా. ఆ తర్వాత అక్టోబరు





16-వ తేదీన క్వెట్టాలో ఒక బహిరంగసభలో ఉపన్యసిస్తూ "పాకిస్థాన్ అంటే ఏమో తెలుసుకోకుండా గాంధీ, నెహ్రూలు ఎందుకుగాను వ్యతిరేకిస్తున్నారో నా కర్థంకాలేదు" అని మాట్లాడాడు. పాకిస్థాన్ కావాలంటూన్న తనకే ఏమీ తెలీదు. విషయం తెలుసుకోకుండా పాకిస్థాన్ కావాలనటం తనకుమాత్రం న్యాయమా? అదే ఉపన్యాసంలో * "మేమేమీ మా లక్ష్యంకోసం త్యాగం చేయలేదని అంటున్నారు. మేము గొర్రెలమంద మోస్తరు కాంగ్రెసువారిలాగా పోలీసుల లాటీదెబ్బలకు తలవొగ్గేవాండ్లము కాని, జైళ్ళకువెళ్ళి తూకం తగ్గింది అనే సాకులు చెప్పి విడిపించుకొనే వాళ్ళం కానీ కాము. సమయం వచ్చిందంటే తుపాకిగుండుకు నాయెదను నిల్పుతాను" అంటూ సొరకాయలు కోశాడు కైదేఅజామ్. ఒకరన్నట్లు నూటు మడతపడితే ఒప్పుకోలేనిజిన్నా ఏమి త్యాగంచేయగలడు? ఇతను త్యాగంచేయవలసిన అవసరాలేమైనా రాకపోయాయా? ఇటీవలనే అఖిల భారత ముస్లింలీగ్ సమావేశం లాహోరుపట్టణమున మింటోపార్కులో జరపాలనుకున్నారు. ఆ సమావేశాన్ని గొర్నమెంటువారు నిషేధించారు. ఏదో కొంత ఆందోళన జరిగింది. అంతటితో ఆ ఆందోళన ఆగిపోయింది. తుపాకిగుండుకు ఎదనిస్తానన్న జిన్నా ఆరో జెందుకు మాట్లాడకుండా, తను చెప్పుకుంటూన్న అత్యంత త్యాగశక్తిని ప్రదర్శించకుండా వుండి నాడో మన కర్థంకావటం లేదు. మాటల్లో వున్న ఒరవడి క్రియలో శూన్యం. కాంగ్రెసుకు పోటీగా జిన్నా ప్రవర్తిస్తున్నాడేకాని, ముస్లింల అభివృద్ధికోసం కాదు. అందుకే అతన్ని బ్రిటీషుఏజంటు అని అంటున్నారు. జిన్నా ఏకైకనాయకత్వంతోవున్న లీగూ—పాకిస్థానూ భారత జాతీయాభ్యుదయానికి నిరోధకాలని రాజకీయజ్ఞులంతా ఏకకంఠంతో నొక్కిచెప్పుతున్నారు. ఈ పెడవాదానికి దోహదమిస్తూన్న కమ్యూనిస్టుల్ని

* We are accused of having made no sacrifices for our goal. I am afraid we cannot contribute that sort of sacrifice to which the congress seems accustomed, namely, to sit like goats under the police lathis, then go to jail, to complain of loss of weight and then to manage to get released. I do not believe in that sort of struggle, but when the time for suffering comes, I will be the first to recieve bullet shots in my chets.

పెద్దలు 'తప్పుదోవను త్రొక్కుతున్నా' రనటం ముమ్మాటికీ న్యాయం.

**షెడ్యూల్డుజాతుల ఫెడరేషన్ :—**

జనాబ్ జిన్నాకంటే నాలుగుఆకులు ఎక్కువగా చదివినవాడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కరు. ఇతన్ని హరిజనుడనుకొని ఓమారు 'సెలోన్' (మంగలిషాపు) లోనికి రానీకపోవటంవల్ల, ముఖ్యంగా బ్రాహ్మణులూ, హిందువులూ హరిజనుల్ని అణగద్రొక్కుతున్నారనే అభిప్రాయంతో పట్టుదలా, ధైర్యమూ కల మానిసికావటంవల్ల హరిజనుల్ని కూడగట్టుకొనివచ్చేందుకుగాను ఈ 'ఫెడరేషన్' లేవనెత్తాడీమహామహుడు!

1929-వ సంవత్సరంలో మనదేశానికి వచ్చిన సైమన్‌కమీషనును జిన్నాసాహెబ్‌తోసహా దేశమంతా బహిష్కారముచేసినప్పుడు ఈ బుద్ధిమంతుడు బొంబాయి లాకాలేజీలో ప్రొఫెసరుగా వుండి సైమనుకమీషనుకు అనుకూలప్రచారం చేశాడు! మరుసటిరోజున కాలేజీక్లాసులోకి అంబేద్కరు రాగానే విద్యార్థులందరూ లేచి "ప్రొఫెసరుగారు సైమనుకమీషనుకు అనుకూలం చూపుతూండటంవల్ల మేము క్లాసునుండి వెళ్ళిపోతున్నా" మన్నారు—వెళ్ళిపోయి పత్రికలకీవిషయం ప్రకటన కిచ్చారు కూడా. ఆరోజు విద్యార్థులు గురువుగారికి బాగా బుద్ధిచెప్పా రన్నమాట!

అంబేద్కరు రాజకీయాల్లో (Politics) అడుగుపెట్టేందుకు ముందే గాంధీజీ హరిజనోద్ధరణకు నడుంకట్టాడు. 1920 లో జరిగిన నాగపురకాంగ్రెసులో అస్పృశ్యుల్నిగూర్చి ఒక తీర్మానం జరిగింది. గాంధీ అస్పృశ్యతానివారణ విషయంలో చాలా శ్రద్ధ చూపుతూవచ్చాడు. హరిజనుల్ని సాంఘికంగానూ, ఆర్థికంగానూ, రాజకీయంగానూ అభివృద్ధికి తేవాలని గాంధీ ఎంతగానో పాటుపడుతూన్నాడు. అటువంటి గాంధీని అంబేద్కరుగారు విశ్వసించటంలేదు.

అంబేద్కరు క్రిప్స్‌రాయబారాలు విఫలమైనతర్వాత క్రిప్స్‌ప్రణాళిక బాగున్నదనీ, దాన్ని త్రోసివేయటంలో కాంగ్రెసుతెలివితక్కువ బయట





పడిందనీ విమర్శించాడు. అట్లా విమర్శించిన ఈ ఘనుడే తన జన్మదినంనాడు క్రిప్స్ ప్రణాళిక 'చెత్త' గా వున్నదనీ, అదేమాత్రమూ భారతీయులు ఒప్పుకోదగిందిగా లేదనీ అన్నాడు. దీనివల్ల ఇతని బుద్ధికి కొంత 'చాంచల్యం' మున్నదనీ, ఆ 'చాంచల్యం' రాజకీయాలకు పనికిరాదనే విషయం మనం తెలుసుకోవాలి.

హిందూ-ముస్లింలు రాజీఅయిన పక్షంలో బ్రిటిషువారి 'ప్రణాళికల బూటకం' సాగదనే అభిప్రాయంతో, క్రిప్స్ వచ్చినప్పుడు "నిమ్నజాతులు కూడా వున్నారు. వారుకూడా రాజీకి రావలసిందేకదా?" అని ఒకమాట వేసి అంబేద్కరుగారిని పైకిలేపి కూర్చోబెట్టాడు. భేదాభిప్రాయాల్ని రేకెత్తించటం బ్రిటిష్‌వారి ధోరణి. ఈమాట భారతీయులమైన మనమన్నట్లయితే అంతబాగా వుండదుకాబట్టి ఫ్రాన్సిస్ గంథర్ అనే ఆంగ్ల రచయిత్రి వ్రాసిన "రివల్యూషన్ ఇన్ ఇండియా" అనే గ్రంథంలోనుంచి నాల్గుమాటలు ఎత్తివ్రాస్తాను. "భారతీయవర్గాలలో విభజనకు దోహదమిచ్చి భేదాభిప్రాయాలను పెంపొందింపజేసి బ్రిటిష్‌ప్రభుత్వం తన ఏకచ్ఛత్రాధిపత్యమును నిలుపుకొన్నది" అంటూ, మరలా "ఇది వ్యక్తమో, అవ్యక్తమోకాని, దేశవిభజనలోనూ, అంతర్యుద్ధంలోనూ, అసహనంలోనూ, నిరంకుశపాలనలోనూ విశ్వసించేవారికి దోహదంచేయడం, ప్రచారమివ్వడం, ధనసహాయంచేయడమే బ్రిటిష్‌వారి విధానంగా వున్నది కూడా!" అని వ్రాసింది. ఈమాటల్ని నమ్మేదానికి యం. యన్. రాయ్‌కి ప్రభుత్వం ధనమిస్తున్నట్లు బయటపడింది. ఇంకా ఇల్లాంటి 'గూడుపుఠాణీ' లెన్ని వున్నాయో!

క్రిప్స్ ఇచ్చిన సహకారంవల్లా, వైస్రాయి కార్యవర్గంలో లభించిన పదవివల్లా అంబేద్కరు పెద్దవాడయ్యాడు. 6 కోట్ల నిమ్నజాతులకు, ఇతరులెవ్వరూ అనకున్నా, తానే ప్రతినిధినని చెప్పుకొంటున్నాడు. ఈ పెద్దమనిషి "అస్పృశ్యులకు కాంగ్రెసూ, గాంధీజీ చేసినదేమిటి?" అని ప్రశ్నిస్తూ, ఒక గ్రంథం సిమ్లాలో సభజరిగే సమయానికే అందజేయాలని కాబోలు, 45 జూలై 10-వ తేదీన ప్రచురించాడు. దీన్నిబట్టి డాక్టరుగారికి

కాంగ్రెసుపైనా, గాంధీపైనా వుండే ద్వేషం రుజువైంది. "అస్పృశ్యులను నానాహింసలూ పెట్టిన సనాతన హిందూమతానికి గాంధీమతం మరొక రూపం మాత్రమే. (!) అస్పృశ్యతానివారణ అనే మిషతో చెలామణీ అవుతూంది. ఈ అస్పృశ్యతానివారణ అన్నదాంట్లో ఆవంతా నిజంలేదు." అంటున్నాడు. ఇదెంతమాత్రం నిజమో ప్రజలే తెలుసుకోగల్గుతారు. నేటి నాగరికులు అస్పృశ్యతను కొద్దో గొప్పో పాటించకుండావున్నారంటే అది గాంధీమహాత్ముని చలవే ననాలి. 1937 ఎన్నికల్లో ఫెడరేషన్‌వారే ఎక్కువగా గెల్చారనే పచ్చిఅబద్ధం చెప్పుతూన్నాడు. ఆరుకోట్ల నిమ్న జాతులకు కాంగ్రెసు ప్రతినిధి కాకుంటే నిమ్నజాతుల సంయుక్తనియోజక వర్గాల్లో న్యాయమైన లెక్కలప్రకారం నూటికి 92 మంది నెగ్గగలుగుతారా? అంబేద్కరుకు తరువాతినాయకుడుగా వున్న రావుబహదూర్ శివరాజ్‌గారు కాంగ్రెసు అభ్యర్థికి 30,905 వోట్లు రాగా 10,615 వోట్లు గెలుచుకొని విపరీతమైన తేడాతో ఓడిపోయాడనేసంగతి మనం మరచి పోకూడదు!

కాంగ్రెసు హరిజనుల్ని దేవాలయప్రవేశ మనే ఉరిలోనికి లాగుతోందని భయపడుతున్నాడు అంబేద్కరు. ఈపాటి సంస్కరణలైనా కాంగ్రెసు హరిజనులకు కలిగించేందుకు ప్రయత్నించిందికదా. తాను వైస్రాయి కార్యవర్గసభ్యుడుగా వుండి జీతపురాళ్లు తీసుకోవటంతప్ప తన జాతికి ఏం సహాయం చేయగలిగాడు? ఇతను వ్రాసిన పుస్తకమూ, దానిలో వున్న కాంగ్రెసుపై విమర్శా చాలా అవకతవకగా వున్నవి. ఇది ప్రతిభారతీయుడూ చదివి అంబేద్కరు "రాజకీయపాత్ర"ను తెలుసుకోవాలి.

అంబేద్కరు హరిజనుల్ని హిందూసంఘంనుండి విడగొట్టాలంటాడు. గాంధీ అలా చేసేందుకు ఒప్పుకోడు. వచ్చిన తగాదా అంతా ఇక్కడే. అసలు రెండువేల సంవత్సరాల ఇవతలనే హిందూసంఘం నుండి హరిజనులు వేరుపడ్డట్లు చారిత్రకాధారాలున్నవి. ఈ అస్పృశ్యత పట్టింపు మరీ ఇవతలనే వచ్చింది. సాంప్రదాయజ్ఞానం లేకుండా హరిజనుల్ని హిందూసంఘంనుండి వేరుచేయాలనటం పొరపాటు. హిందూ





ఆధిపత్యం, లేదా "జబర్దస్తీ"నుండి తొలగించటం అవసరం. దీనికి 1932 లో జరిగిన "పూనాపాక్టు"ను అనుసరించి అంబేద్కరు హిందువులతో సహకారం నెరపివున్నట్లైతే ఈపాటికి హిందూసంఘంలో హరిజనుల ఐక్యత కొంతవరకైనా కలిగివుండేది. అట్లా సహకరించకపోవటం వీరిదే తప్పు. ఇది అంబేద్కరుగారి సిద్ధాంత రాద్ధాంతాల స్థూలస్వరూపము.

మన కమ్యూనిస్టుమిత్రులు జిన్నాపాకిస్థాన్‌తోపాటు అంబేద్కరుగారి ఫెడరేషన్‌నుకూడా సమర్థిస్తున్నారు. డాక్టరుగారు ఆంధ్రాషెడ్యూల్డు జాతుల ఫెడరేషన్‌వారికి 19-8-45 తేదీన వ్రాసిన ఒక జాబులో కమ్యూనిస్టులను బాధ్యతగల స్థానాలనుండి తొలగించమని వ్రాశారు. దీన్నిబట్టి వీరికికూడా కమ్యూనిస్టులపై సరియైన అభిప్రాయం లేనట్లు మనకు తెలుస్తోంది.

1935 భారతరాజ్యాంగచట్టంలో నిమ్నజాతులకు వేరే ప్రత్యేక నియోజకవర్గా లేర్పాటు చేయాలంటే గాంధీజీ తన అసమ్మతిని తెల్పి ఉపవాసదీక్ష బూని కడకు జయించాడు. ప్రత్యేక నియోజకవర్గాలు లేకుండా సంయుక్త నియోజకవర్గాల్నే ఏర్పరిచేట్లు చేశాడు. హిందూసంఘంనుండి నిమ్నజాతులు పూర్తిగా విడిపోతే మరీ అధ్వాన్నస్థితిలోకి రాక తప్పదు. అటువంటప్పుడు అంబేద్కరు అన్నట్లే కమ్యూనిస్టులుకూడా "కాంగ్రెసు అస్పృశ్యులకు ఏమీ చేయలే"దంటూ, ప్రత్యేక నియోజకవర్గా లేర్పరచమంటున్నారు. నిమ్నజాతుల్ని ప్రత్యేక "తెగ"గా పరిగణించమంటున్నారు. కామ్రేడ్ బి. టి. రణదివేవ్రాసిన "స్వాతంత్ర్య పోరాటంలో ఆరుకోట్ల నిమ్నజాతుల స్థానం" అనే పుస్తకంలో అంబేద్కరు కోరని విపరీతకోర్కెల్ని కాంగ్రెసు ప్రసాదించాలని ప్రతిపాదించాడు. ఒకవైపు కాంగ్రెసువారు అంటరానితనం పోయేందుకుగాను నిమ్నజాతులకు ప్రత్యేక గూడెములు అవసరంలేదనీ, గ్రామాల్లోనే వారిని ఇండ్లుకట్టుకొనేట్లు చేయాలనీ ప్రచారంచేస్తుంటే "వీరికి ప్రత్యేకగ్రామాలు కట్టించాలి." అని కమ్యూనిస్టులు అనటంలో ఏమాత్రం న్యాయమున్నదో ఆలోచించండి. నలుగురిలోనూ కలిసిమెలిసి తిరుగుతూంటే అంటరానితనం



150054

కాని, మా అంతట మేము ప్రత్యేకంగా వుంటామన్నట్లైతే అంటరాని తనం మరీ ఎక్కువౌతుందనే విషయం ఆలోచించకుండా కమ్యూనిస్టులు పిచ్చిపిచ్చి పుస్తకాలు వ్రాయటం, తల తిరుగుడు సమస్యల్ని లేవనెత్తటం చాలా పొరపాటు.

కిసాన్ సభ :—

కాంగ్రెసుకీ, కిసాన్‌సభకీ కొన్నికొన్నిచోట్ల అభిప్రాయభేదా లున్నప్పటికీ ద్వేషంమాత్రం లేదు. కిసాన్‌సభలోని కొందరు వ్యక్తులుమాత్రం కాంగ్రెసును ద్వేషించిన మాటమాత్రం వాస్తవం. 1942 నుండి కిసాన్ సభను కాంగ్రెసుకు సంపూర్ణ వ్యతిరేకంగా చేయాలని కమ్యూనిస్టులు పాటుబడ్డారు. కొన్నికొన్ని అధికార స్థానాల్లో ఇరుక్కున్నారు. ఈ ఉద్దేశం మొట్టమొదట బీహారురాష్ట్రమున భీటాలో జరిగిన అఖిలభారత కిసాన్‌సభ 1942 మే లో జరిగినప్పుడు బయటపడింది. కాంగ్రెసుకు వ్యతిరేకంగా తీర్మానించాలన్నందువల్లనే శ్రీ స్వామి సహజానందకున్నూ, ఇందూలాల్ యాగ్నిక్‌కున్నూ తగాదా పడింది. యాగ్నిక్ కిసాన్‌సభలో పలుకుబడిగల వారిలో ఒకరు. కమ్యూనిస్టు పక్షపాతిగా వుండేవాడు. ఇతని పలుకుబడి వినియోగించుకొంటూ కమ్యూనిస్టులు గందరగోళం చేశారు. స్వామీజీ ఎంత ప్రయత్నించినా లాభం లేకపోవటంవల్ల కిసాన్‌సభావేదికపై "కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ చేసిన తీర్మానం జపానువారిని ప్రత్యక్షంగా ఇండియాకు రమ్మని ఆహ్వానము" అని కమ్యూనిస్టువర్గంవారు పట్టుబట్టి తీర్మానించారు.

1944 సంవత్సరం బెజవాడలో జరిగిన అఖిలభారత కిసాన్‌సభలో కమ్యూనిస్టుల ప్రాబల్యం రాబోతున్నదని ప్రజలు భయపడుతుంటే స్వామీజీ "కిసాన్‌సభలో కమ్యూనిస్టుల ప్రాబల్యం రావటానికి వీల్లేదు. కిసాన్‌సభా వేదికను కమ్యూనిస్టులను ఉపయోగింపనివ్వము" అని సభకుముందే స్పష్టంగా ప్రకటించాడు.

1945 ఫిబ్రవరి 7 వ తేదీన కొందరు వ్యక్తులపైనా, కొన్ని జిల్లా రాష్ట్ర కిసాన్‌సభలపైనా స్వామీజీ డిసిప్లినరీచర్య తీసికొన్నాడు. ఆ సంద





ర్భంలో సభా కేంద్ర కార్యాలయం పాట్నానుండి ఈక్రింది ప్రకటన చేయబడింది. "లోగడ పాకిస్థాన్‌కు అనుకూల, ప్రతికూల ప్రచారం చేయగూడదని కిసాన్‌సభ తీర్మానించివున్నది. పాకిస్థాన్‌కు అనుకూల ప్రచారం చేస్తుండే కమ్యూనిస్టు అనుయాయులు ఎంత చెప్పినా వినటంలేదు కాబట్టి అట్టి వ్యక్తులపై డిసిప్లినరీ చర్య తీసుకోబడుతున్నది" అన్నారు. "ముందు వచ్చిన చెవులకంటే వెనుకవచ్చిన కొమ్ములు వాడి" అన్నట్లు అధ్యక్షుడిట్లా ప్రకటిస్తే ప్రధాన కార్యదర్శి అయిన బంకిం ముఖర్జీ (కమ్యూనిస్టు అనుయాయి ) స్వామీజీకి డిసిప్లినరీచర్య తీసుకొనే అధికారం లేదని ప్రకటించాడు. దీన్నిబట్టి కమ్యూనిస్టు లెక్కడ చేరినా కయ్యానికి కాలు దువ్వుతారనే విషయం బయటపడింది.

ఏ పేచీలూ లేకుండా నిరాఘాటంగా సాగుతున్న కిసాన్‌సభలో కమ్యూనిస్టులు ప్రవేశించి నానాగందరగోళం చేశారు. మొన్న అక్టోబరు 20, 21 తేదీల్లో కిసాన్‌సభలో వీరికి పలుకుబడి తెచ్చిన శ్రీ ఇందూలాల్ యాగ్నిక్‌గారు పూనాలో వల్లభాయి పటేల్‌తోనూ, గాంధీతోనూ మాట్లాడి కాంగ్రెసులో చేరాడు. దీనితో ఇకమీదట మన కమ్యూనిస్టులకి కిసాన్ సభలో పలుకుబడి వుండదనే విషయం స్పష్టమైంది.

అనేక ఉద్యమాలు :—

పైమూటిలో మొదటి రెండు సంస్థలూ కాంగ్రెసుకు సంపూర్ణ వ్యతిరేకమైనవి. కిసాన్‌సభమాత్రం తటస్థంగా వుండేది. ఈ మూడు ఉద్యమాలకీ వీరుచేసిన "సేవ"ను వివరించాను. హిందూమహాసభను మొదటి నుండి ఆడిపోస్తున్నారు. తరువాత లేబరు, కార్మిక, విద్యార్థి, సాహిత్య ఉద్యమాల్లోనూ 'ఖదం' త్రొక్కారు. కొన్నాళ్లు పురోగామి రచయిత సంఘం (Progressive writers' association) కమ్యూనిస్టు వాఙ్మయ వ్యాప్తికై పాటుపడుతూ వచ్చింది. ఇటీవల దీంట్లోనూ కమ్యూనిస్టుల ప్రాజాపత్యం తగ్గిపోయినట్లు వార్తలు వస్తున్నవి.

కమ్యూనిస్టులు అన్ని వుద్యమాల్లోనూ ప్రవేశించారు. వీరికి ప్రవేశమివ్వని హిందూమహాసభలాంటివాటిని తూర్పారబట్టారు. వీరి కోరచివి

బట్టి చూస్తే కాంగ్రెసుకు వ్యతిరేకంగా వున్నవాటిని బలపరచా లనుకున్నారు. కాంగ్రెసుకు కొద్దో గొప్పో అనుకూలమైన సంస్థ లుంటే వాటిని తిట్టిపోతామనుకున్నారు. ఇదీ ఉన్న రహస్యం.

ఆగస్టు ఉద్యమంలో పాల్గొన్నవారిని రౌడీలని అన్నారు. కొందరు కాంగ్రెసువాదుల్ని 'ఫిఫ్తు కాలమిస్టులు' (శత్రువుకు సహాయంచేసేవారు) అని అన్నారు. కాంగ్రెసు ఇకమీద బయటపడలేదు లెమ్మనే గుడ్డి అభిప్రాయంతోనే ఈ పనులన్నీ చేశారని నేను భావిస్తున్నాను. వీరి మాటలు ప్రజలు విశ్వసించేందుకుగాను నాయకులను వదలిపెట్టాలని ప్రజలవద్ద సంతకాలు తీసుకొని ప్రభుత్వానికి మహజర్లు పంపారు. ఇదంతా 'పాపులారిటీ' కోసం పడ్డ తంటాలే!

బెంగాల్‌కరవు సందర్భంలో వీండ్లు అంతో ఇంతో సహాయం చేసినమాట వాస్తవం. కాని, వీరంత నాల్గంతలు ధనం ప్రోగుచేసి కరవులో ఎక్కువగా సాయపడ్డ హిందూమహాసభపై వీరు నానా నీచంగా తమ పత్రికల్లో వ్రాశారు.

ఆ తర్వాత ప్రజల్ని మోసపుచ్చేందుకు గుడ్డిగా పదేపదే దొంగ మార్కెట్టులో అమ్మినవారు, అధికలాభపరులు-అనే మాటలు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. గౌర్నమెంటువారు న్యూస్‌ప్రింట్‌కోటా ఇవ్వలేదని తామే చెప్పుకున్నారు. కోటా లేనిపక్షంలో న్యూస్‌ప్రింట్ చిక్కటం బహు దుర్లభంగా వున్నరోజుల్లో వీరికి నెలకు కావలసిన రెండుమూడు టన్నుల పేపరు ఎక్కడనుండి చిక్కేది? తప్పకుండా వీరు బ్లాక్‌మార్కెట్టులో కొనే వుంటారన్నమాట! రెండణాలు పడే 'జోషీ-గాంధీ ఉత్తర ప్రత్యుత్తరాలు' అనే పుస్తకానికి ఒకరూపాయి ఖరీదు పెట్టటంతో, కమ్యూనిస్టులు సహా అధికలాభపరు లనేందుకు సందేహం లేదు.

దొంగమార్కెట్టును ప్రోత్సహించిందే గౌర్నమెంటు గెజటెడ్ ఆఫీసర్లు. ఈవ్యాపారస్థులమీద పడకుంటే, లంచం తీసుకొని ప్రోత్సాహమిచ్చిన ఆఫీసర్లను ఒక్కమారైనా తీక్షణంగా విమర్శించారా? పోలీసులు కేసులుపెట్టిన తరువాత ఆవార్తల్ని తమ పేపర్లలో వేసుకొన్నారే





కాని, తామే ఏ ఆఫీసరు అక్రమాన్నైనా బయటపెట్టారా? ఒక్కరిని గురించైనా లంచం తీసుకొంటున్నాడనికాని, దొంగమార్కెట్టును ప్రోత్సాహిస్తున్నాడనికాని అన్నారా?

యుద్ధఫండులా, విక్టరీబాండ్లా విషయంలో అధికారులు ప్రజలపై చూపిన దౌర్జన్యాన్నిగూర్చి ఎందుకు ఖండించలేదు?

వీరు చాలా విషయాల్లో ప్రభుత్వంవారితో అనుకూలంగా వుండటాన్నిబట్టే నలుగురూ వీరికీ, ప్రభుత్వానికీ మధ్య ఏదో ఒక "ఖరారు" వున్నట్లు భావిస్తున్నారు.

కాంగ్రెసువారంతా బయటపడకముందు దేశంలో పలుచోట్ల కాంగ్రెసువ్యక్తులతో పోట్లాడారు. దెబ్బలుకొట్టారు. దెబ్బలు తిన్నారు. బొంబాయిలో శ్రీ శంకరరావుదేవ్‌గారు (కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ సభ్యుడు) ఉపన్యసిస్తూండగా కమ్యూనిస్టులు గందరగోళం లేపారు. ఇరుతెగలవారిలోనూ చాలామంది గాయపడ్డారు. ఇటీవల ఈ 'రౌడీఇజమ్' చాలావరకు తగ్గినట్లున్నది. మాటలతో ఏ పార్టీతోనైనా పోట్లాట్టం ఒకరకంగా వుంటుంది కాని, కర్రలవరకూ రాకూడదు. ఈ సత్యాన్ని మన కమ్యూనిస్టు మిత్రులు గుర్తించగలిగితే సంతోషం.

## ౪

## అక్టోబరు—5-31

అక్టోబరు 5-వ తేదీతో భారత కమ్యూనిస్టు పార్టీలో నూతనాధ్యాయం ప్రారంభమైంది. పార్టీ ప్రధానకార్యదర్శియైన శ్రీ పి. సి. జోషీగారు పై తేదీన ఏ. ఐ. సి. సి. సభ్యుల్ని తప్ప తక్కిన కమ్యూనిస్టుల్ని కాంగ్రెసునుండి వైదొలగండని ఆదేశించారు. సెప్టంబరు 21, 22, 23 తేదీల్లో బొంబాయిలో జరిగిన ఎ. ఐ. సి. సి. సమావేశంలో కమ్యూనిస్టులు ప్రాథమిక సభ్యులుగా కాంగ్రెసులో వుండవచ్చుననీ, బాధ్యతాయుతమైన పదవుల్లోమాత్రం వుండటానికి వీల్లేదనీ అన్నారు. కమ్యూనిస్టుల్ని ఆగస్టుతీర్మానానికి ("క్విట్ ఇండియా" తీర్మానానికి) ఎందుకు

వ్యతిరేకులుగా వున్నారో సమాధానమిమ్మని అడిగారు. దీనికి సరియైన సమాధానము చెప్పకుండానే కాంగ్రెసునుండి కమ్యూనిస్టులు వైదొల గారు. దీనికి భారతదేశంవారేకాక, ఇంగ్లండులోని ఇండియా లీగువారు సహా సంతోషించారు!

శ్రీ పి. సి. జోషీగారు కాంగ్రెసునుండి వైదొలగమని, అంతటితో ఊరకుండక అదే ప్రకటనలోనే తమ అక్కసునంతా కాంగ్రెసుపై వెళ్ళ గ్రక్కారు. † "కాంగ్రెసు ట్రేడుయూనియనులకూ, కిసాన్ సభలకూ వ్యతిరేకమైన సంస్థలను ప్రత్యక్షముగానూ, పరోక్షముగానూ ప్రోత్సాహ పరుస్తూండిం"దని అంటున్నారు. మరలా "కాంగ్రెసుపెద్దలు కమ్యూనిస్టు-లీగు వ్యతిరేకత చూపడమనేది ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రజల్లో కలహానికి దోహదమిస్తూ దేశవినాశనానికే దారి తీస్తున్నదికాని, దేశస్వాతంత్ర్యానికి కాదు"అని చెప్పతున్నారు. మత, కుల, వర్గతత్వాల్ని రెచ్చగొట్టి మన కమ్యూనిస్టులే దేశంలో ప్రజాకలహాలకి దారితీస్తున్నారు కాని, అన్ని తత్వాల్నీ దేశస్వాతంత్ర్య బలిదానానికి ఆహ్వానిస్తున్న కాంగ్రెసు కాదు—మూటికీ ముమ్మాటికీ కాదు. కమ్యూనిస్టుల మాటల్ని మూఢులుతప్ప మరెవ్వరూ విశ్వసించరు.

## ఎన్నికల్లో కాంగ్రెసుతో పోటీ:—

ఎన్నికల్లో కాంగ్రెసుతో ప్రత్యక్షంగా పోటీచేయటానికి కమ్యూనిస్టులు సిద్ధపడ్డారు. జస్టిస్‌పార్టీ నామరూపాలులేకుండా పోయేసరికి మన "ప్రజాయుద్ధపు" కామ్రేడులు కాంగ్రెసుతో పోటీకి తయారయ్యారు. వీరి ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెసుపై విమర్శే ప్రధానముగ నున్నది, కాంగ్రెసుపై ప్రజల్లో ఎన్ని అపోహలు పుట్టించాలో అన్నీ పుట్టిస్తున్నారు. అక్టో. 14 "పీపిల్సువార్"లో యు. పి. లో సెంట్రల్ అసెంబ్లీకి కాంగ్రెసు టికెట్టుకుగాను ఒక అభ్యర్థి 50,000 రు. ఇస్తానన్నాడనే వార్త ప్రకటించారు. కాంగ్రెసుపై ఇల్లాంటి దుష్ప్రచారం చేస్తున్నారు. ఇంకా పల్లెటూళ్ళలో చాలా వింతవేషాలతో, వింతప్రచారాలు సాగిస్తున్నారు. వాటినంతా కాంగ్రెసువాదులు ఎప్పటికప్పుడు ఖండిస్తూ వుండటంమంచిది.

వీరి ఎలెక్షన్ మేనిఫెస్టోలో (ఎన్నికలప్రణాళిక) కమ్యూనిస్టు-కాంగ్రెసు-లీగు ఐక్యత కావాలంటున్నారు. తమ పార్టీ ఐక్యతకూడా కావాలని తామే చెప్పకోవటంలో వీరి తెలివితక్కువ బయటపడ్డది. వైస్రాయి కార్యవర్గంలో కమ్యూనిస్టులకికూడా సభ్యత్వం కావాలేమో? లీగూ-కాంగ్రెసు ఐక్యత కావాలంటున్నారుకాని దానికోసం వీరి ప్రణాళిక ఏమిటో బయటపెట్టలేదే! కాంగ్రెసు లీగుతో రాజీకోసం ఎంతో ప్రయత్నించింది. గాంధీజీ స్వయంగా జిన్నాతో రాయబారాలు జరిపాడు. సిమ్లాలో వైస్రాయికూడా ప్రయత్నించాడు. లీగుతో ఐక్యత కుందేటి కొమ్మువంటిదని తలచి కడకు కాంగ్రెసు ఇకమీద ఏలాంటి రాయబారాలూ జరుపకూడదని నిర్ణయించుకున్నది. అటువంటప్పుడు మన కమ్యూనిస్టుల "ఐక్యతాపాలిసీ" ఏమిటి? అటు కాంగ్రెసూ - ఇటు లీగూ కమ్యూనిస్టుల్ని నమ్మటంలేదు. వాది, ప్రతివాదు లిద్దరూ ఈ పెద్దమనిషిని (కమ్యూనిస్టుపార్టీని) ఒప్పకోమంటుంటే వీ రెలా రాజీచేయగలుగుతారు:

బెలూచిస్థాన్, పంజాబ్, సరిహద్దు మొదలైన ప్రాంతాలు ముస్లింల జన్మభూములని వాదిస్తున్నారు. ముస్లింల జన్మభూములు అరబ్, టర్కీస్థాన్‌లని మన కమ్యూనిస్టులకు తెలియదా? నేడు మన దేశములో వున్న ముస్లింలలో నూటికి 37 మంది మతంపుచ్చుకొన్న మహమ్మదీయులే!

వీరు చేస్తున్న అపప్రచారాన్నిగూర్చి వ్రాయాల్సివస్తే ఎంతైనా వ్రాయవచ్చు. నిజంగా, అక్టోబరు 24-వ తేదీన నెహ్రూగారన్నట్లు "భారత కమ్యూనిస్టులు రష్యా కమ్యూనిజంపేరు చెడగొట్టుతున్నారు" అనే మాట

† "Congress leaders are also directly or indirectly supporting the setting up of rival Trade unions, Kisan sabhas etc. through elements who are open agents of the big profiteers or discredited Kisan and Labour leaders who want to stage a come-back with congress aid.

We Indian communists consider this anti-league, anti-communist policy of the congress high command as direct encouragement to the forces of civil war which will lead to the country's ruin not to its freedom. We consider it our foremost duty to democrate ourselves sharply from such a policy."

ప్రత్యక్షసత్యము. బాగా ఆలోచిస్తే మన కామ్రేడులు కమ్యూనిజానికి అంధానుచరులే కాని, నిజాయితీఅయిన కమ్యూనిస్టులుమాత్రం కారు.

కూలీలలో మా కెక్కువ పలుకుబడి వున్నదని చెప్పుకొంటున్నారు. వీరి ఉద్యమానికి ఉనికిపట్టుగా వున్న బొంబాయిలో అక్టో. 25 న జరిగిన మున్సిపల్ బై ఎలెక్షన్లలో లేబరుసీటుకు కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి కాంగ్రెసుఅభ్యర్థితో పోటీచేసి విపరీతమైన తేడాలో ఓడిపోయాడు. దీనితో వీరికి లేబరులలో ఎంత పలుకుబడి వున్నదీ మీరే ఊహించుకోండి.

ఆజాద్ హింద్‌ఫౌజును (I. N. A) గూర్చి దేశమంతా వారి కోర్కె న్యాయమైనదనీ, వారు భారతదేశస్వాతంత్ర్య వాంఛతోనే అట్లు చేశారనీ ఉద్ఘోషిస్తూవుంటే మన కామ్రేడులు అక్టో 28 వ తేదీ "లోక యుద్ధము" లో (పార్టీ హిందీ వారపత్రిక) ఆజాద్ హింద్‌ఫౌజునుగూర్చి సంపాదకీయం వ్రాశారు. అందులో "వారిని ప్రశంసించటం, వారి మార్గాన్ని మంచిదని చూపటం తప్పు" అని (హిందీ—ఉనకీ ప్రశంసా కరనా, ఉనకే రాస్తేకో సహీబతానా గలత్ హై) అంటున్నారు. దీనివల్ల వీరియొక్క హృదయం స్పష్టమౌతున్నదికదా ?

ఈగ్రంథం భారతకమ్యూనిస్టుల పుట్టుపూర్వోత్తరాల్నీ, వారి వింత వైఖరినీ ప్రజకు స్థూలంగా తెలియజేసేందుకు వ్రాశాను. విషయాన్ని సాధ్యమైనంతవరకు కుదించాలనే ప్రయత్నించాను. వీరి నుంచి చెడ్డల్ని గమనించి, అరవై సంవత్సరాలుగా భారతజాతీయ ప్రజలు రంగంలో నడుంకట్టి పనిచేస్తున్న కాంగ్రెసుసేవను గుర్తించి, కమ్యూనిస్టుల దుష్ప్రచారానికి చెవిఒగ్గకుండా వుండాలనీ, జరుగనున్న ఎన్నికల్లో కాంగ్రెసుకే అఖండవిజయం చేకూర్చాలనీ నా సోదర, సోదరీమణుల్ని ప్రార్థిస్తున్నాను.

"ఇంక్విలాబ్ జిందాబాద్ !" "ఢిల్లీ ఛలో !" జై హింద్ !"

157054
600 008.

B. S. K. ...ra. Q. H. No. M. S. 100/B.
For Q. H. No. K. L. 41/B. & H. 2000 Copies December 45.

TL
V2,4N24
38N45

# VOTE FOR CONGRESS



ప్రకాశకులు: ఎ. ఈశ్వరయ్యశెట్టి అండు సన్సు, కర్నూలు.